మామయ్య వంట

'వినోదానంద్'

"ఇదిగో—నామాట వినండి! లక్షణంగా హోటలు నుండి క్యారియరు తెప్పించండి. నాకేదో కడుపు నొప్పిగా నున్నది – నేను భోంచేయను. మీకు, పిల్లలకూను — పోతేపోయింది ఒక రూపాయి" అంది అత్తయ్య.

"చాల్లే ఊరుకో – యీ ఒక్క పూట భాగ్యానికి హోటలునుండి తెప్పించాలా! ఆ కూర, చారునీళ్లు, పచ్చడి యింట్లో చేయలేనూ" అన్నాడు మామయ్య.

అది ముట్టయిన మూడవరోజు. మర్నాడు అత్తయ్య ఎలాగూ స్నానంచేసి యింట్లోకి వస్తుంది.

గడచిన రెండు రోజులూ వాళ్ళ పెద్దబ్బాయి వంట చేసిపెట్టాడు. అంటే వాళ్ళ కాలేజి స్కౌట్ల క్యాంపులలో వంటచేసి మంచి అనుభవం కలవాడు. కాని ఆరోజు కాలేజి సెలవయిపోయి తెరవడంవల్ల వాడు ఆ ఉదయం బండీకి వెళ్ళిపోక తప్పిందికాదు.

"అయితే పోనీయండి - అన్నం మాత్రం ఉడకేసి, సాధకాలను హోటలునుండి తెప్పిస్తురూ! — ఎందుకొచ్చిన శ్రమ మీకిది" అన్నది అత్తయ్య.

మామయ్యకు ఆమె మాటలు రుచించక "ఏమిటీ నస అస్తమానం! నీవలా ఒకమూల పడియుండి చూస్తుండరాదూ!" అన్నాడు కటువుగా.

"మీ యిష్టం... నాకెందుకులెండి!" అంటూ గదిలోకి వెళ్ళింది.

"పెద్దమ్మాయ్! సుబ్బిని కట్టెలు తెమ్మనమ్మా! యిప్పటికే ఎండెక్కింది" అంటూ మామయ్య కేకలు ప్రారంభించాడు.

"సీనూ! కిరసనాయిలు, నిప్పుపెట్టె ఎక్కడున్నవో చూడరా."

"మొన్ననే చెప్పానుకదండీ కిరసనాయిలు అయిపోయిందని — నిన్నరాత్రి కటిక-చీకట్లో పండుకున్న సంగతి జ్ఞాపకంలేదూ!" అని సాగదీసింది విస్తళ్ళు కుడ్తూ అత్తయ్య.

"ఈ పూటకు కట్టెలున్నవిలే సుబ్బీ! – కిరసనాయిలు త్వరగా తీసుకొని రా" అని కేకవేశాడు మామయ్య.

"అమ్మాయ్! యీవేళ మనం అన్నంలోకి ఏమి చేసుకుందాం చెప్పు" అన్నాడు మామయ్య కూతురుతో తనేదో ఘనకార్యం చేయబోతున్నట్లు.

"బంగాళాదుంపల కూర – హోటల్లో చేసినట్లు ఉల్లిపాయలు వేసి చేస్తే బాగుంటుంది నాన్నా!" అన్నది అమ్మాయి.

"దుంపలు సన్నగా తరిగి నేతిలో వేయిస్తే బాగుంటుంది నాన్నా!" అన్నాడు సీను.

ఇంతలో అత్తయ్య కలుగజేసికొని "ఏమీవద్దు — నిన్నటి మినుముల చింతపండు పచ్చడి యున్నది. కానీనన్ని వడియాలు వేయించుకొని, వెంకమ్మ దగ్గర ఒక పావుసేరు పెరుగు పోయించుకుంటే చాలు యీ పూటకు" అన్నది అత్తయ్య.

"తమర్ని యిప్పుడెవ్వరూ అడగలేదు — నోరు మూసుక కూర్చుంటే చాలు! నా తిప్పలు నేను పడతాను" అన్నాడు మామయ్య.

మనిపర్సు తీసి "సీనూ! బజారుకెళ్ళి ఒక అరవీశె బంగాళాదుంపలు తీసికొని రా మంచివిగా చూచి" అంటూ రూపాయనోటు చేతికిచ్చాడు.

"చిన్నమ్మాయ్! సుబ్బిని కిరసనాయిలుకు పంపి తెప్పించు. వీధిలో పెరుగు అమ్మే వెంకమ్మ వస్తే పిలువమని చెప్పు."

కొంచముసేపటికల్లా సుబ్బి కిరసనాయిలు తెచ్చి, కట్టెలు విరిచి కుప్పగా పెట్టింది. మామయ్య రెండు పిడకల నిండా కిరసనాయిలు పోసి పొయ్యి ముట్టించబోతే అగ్గిపెట్టె అగుపడితేకదూ! విసుక్కుంటూ "ఆ పాడుముండను అడుగు అగ్గిపెట్టెను ఎక్కడ పెట్టిందో!" అన్నాడు. ఇంతలో దేవుడి పటం ముందు అగ్గిపెట్టె కనుపించి "వద్దులే-రా—యిక్కడ యున్నది" సుబ్బిని పిలిచి పిడకలు ముట్టించాడు. త్వరగా పొయి రాజుకోవాలని పది పుల్లలు పొయిలో తురిమేసరికి మంట ఆరిపోయింది. పిడకలు చల్లారిపోయినట్లు అనిపించింది.

"ఈ వెధవ పచ్చివి లేకపోతే మంచివి వేయించుకోకూడదూ! పాడుముండ" అని మామయ్య అంటుంటే సందులోనుండి తొంగిచూచిన సుబ్బి నవ్వినట్లు వినబడింది.

"బాగుంది. ఎప్పుడూ లేంది యిదేమి అన్యాయం! యీ ముండ, రండ తిట్లేమిటీ, రభస ఏమిటీ — మంచివంటే" అంటూ నడవదాటి వచ్చి పొయితట్టు కిటికీలోనుండి చూచి "అదేమిటండీ! అన్నిపుల్లలూ! సుబ్బీ నీవైనా చెప్పకూడదటే. మొదట నాలుగు పుల్లలు పెట్టి అవి అంటుకున్న తరువాత మరి రెండు పెడితే పొయి బాగా మండుతుంది.

ఆ మాటలు వినేసరికి మామయ్యకు చాల కోపం వచ్చింది. కాని తన నిస్సహాయస్థితిలో చేయునది మరేమిలేక పండ్లు పటపట కొరుక్కొని భార్య చెప్పినట్లు చేశాడు. అందరి అదృష్టమా అన్నట్లు పొయ్యి మండింది. భార్య చెప్పినట్లు మూడు లోటాల బియ్యంపోసి కడిగి గిన్నె నిండా నీళ్లుపోసి పొయి మీద పెట్టాడు. అయిదు నిముషాలయిందో లేదో మూత తీసి బియ్యం ఉడుకుపట్టినవేమో చూచాడు. అప్పటికింకా నీళ్లైనా వెచ్చబడలేదు. మంట జాస్తిగానుంటే త్వరగా అన్నమగుతుందని గుక్కతిప్పుకోకుండా విసనకర్రతో విసిరేసరికి మండు పొయ్యి కాస్తా ఆరిపోయి పొగరాజడం మొదలు పెట్టింది. మళ్ళీ కిరసనాయిలు పోసి, అగ్గిపుల్ల గీచి ముట్టించాడు, ఈసారి బాగా మండింది. పది నిముషాల కంతా కుతకుతమనే శబ్దం వినిపించింది. నీళ్ళు జాస్తి పోశానేమో ననుకుంటూ రెండుమూడు గరిటెల నీళ్ళు తీసి పారబోశాడు. అన్నం ఉడికిందేమోనని గరిటెతో ఎత్తిచూస్తే యింకా బియ్యంగానే యుండింది. మళ్లీ ఒక లోటానీళ్లు గిన్నెలో పోసి మూతపెట్టాడు చాలవేమోనని.

ఇంతలో బంగాళాదుంపలు తెచ్చారు. "సుబ్బీ! కత్తిపీట ఎక్కడుందో అడుగు" అన్నాడు మామయ్య అత్తయ్యకు వినబడేటట్లు.

ఆమె "నాకేం తెలుసూ! అబ్బాయి ఎక్కడ పెట్టాడో. కొంచెము వెతికితే కనిపించదూ" అన్నది.

"ఆ... చిత్తం — వెతికితే కనుపిస్తుందని నాకు తెలియదూ! — నీవు జోస్యం చెప్పాలా... పెద్దమ్మాయ్! కత్తిపీట ఎక్కడయుందో చూడూ — సీనూ! నీవుకూడ వెతకరా."

"నాకు తెలియదు నాన్నా! నాకు ఆకలి అగుతున్నది" అంటూ ఏడుపు మొదలుపెట్టాడు సీను.

మామయ్యకు కోపం జాస్తయింది. ఒకప్రక్కన అన్నంగిన్నె ఎప్పుడు దించాలనో తెలియలేదు. పొయ్యిమీది గిన్నె — వేడిగా నుందాయె! ఎలాగ దించడమోనని భయం! కత్తిపీట అగుపడలేదు. ఈ సమయంలో సీను ఏడుపు...

"ఇంకా 9 గంటలయినా కాలేదు. అప్పుడే ఆకలేమిటి? తెల్లవారకముందే గిన్నెడు కాఫీ త్రాగావు కదా" అని దబాయించాలని ప్రయత్నించాడు కాని నిజానికి 11 గంటలు కాబోతుండుటచే పిల్లలు ఆకలితో నకనకలాడిపోతున్నారు. పాపం సీను వెక్కివెక్కి ఏడుస్తూ చొక్కా విప్పేసి వాళ్ళమ్మ దగ్గరకుపోయి చాపమీద పండుకున్నాడు.

పెద్దమ్మాయి "నాన్నా! పైన చెక్కమీద నున్నట్లుంది చూడు" అన్నది నిక్కినిక్కి పైన చూస్తూ.

"నేను చూచి మీకు అన్నీ అమర్చిపెట్టేటట్లయితే మీరంతా ఎందుకూ! వండి వార్చిపెడితే తినడానికా! నా కోటుజేబులో పేనాకత్తి యుంది తీసికొని రా."

పేనాకత్తితో దుంపలు తరుగ నారంభిస్తే ఒకదాని ఆకారం యింకొకదానికి లేదు. చిన్నవి, పెద్దవి నానాగోత్రాలుగా తయారయినవి ముక్కలు.

ఇక పొయ్యిమీదనున్న గిన్నెను దించ ప్రయత్నం ప్రారంభమయింది.

"సుబ్బీ! పక్కయింటికి పోయి పాత న్యూస్ పేపరు యిప్పించుకరా. అది పోతే యివ్వరేమో అమ్మాయ్ నీవే వెళ్ళిరామ్మా!" అన్నాడు మామయ్య పెద్దమ్మాయితో.

రెండు నిముషాలయినా యింకా రాలేదు అమ్మాయి. యీ లోపల తన తుండుగుడ్డతో పట్టుకొని దించడానికి ప్రయత్నించాడు. పాపం ఒక కొనకు నిప్పు అంటుకుంది.

"ఏమండోయ్! ఎక్కడో గుడ్డ కాలుతున్న వాసన వస్తున్నది చూడండి" అన్నది అత్తయ్య గొంతెత్తి.

"ఏమీలేదు. అన్నం మెతుకులు రెండు పొయిలో పడ్డవి" అంటూ ఎలాగో బ్రహ్మప్రయత్నంతో అన్నంగిన్నె దించి క్రిందపెట్టి తుండుగుడ్డను మూల పారేసి దుంపలు తరగడానికి కూర్చున్నాడు. దుంపలు తరిగేకొద్దీ నూతన భావపరంపరలతో వేలు కాస్తా కోసుకున్నాడు. "అబ్బ!" అని అరుస్తూ రక్తం కారుతున్న చేయితో తడిగుడ్డ చుట్టడానికని లేచాడు. తేలేమైనా కుట్టిందేమోనని అత్తయ్య కిటికీ దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది.

"అమ్మాయ్! మొద్దులాగా నిలబడతావేం! —

తుండుగుడ్డ తీసికొని రా" అంటూ గొడవ ప్రారంభించాడు.

"ఏందమ్మా! మంచివంటే - మీ యిద్దరి తిట్లతో నా ఒళ్ళు చిల్లులు పడుతున్నది. నాకేం తెలియదు పోండి" అంటూ పెద్దమ్మాయి మంచం వాల్చుకొని పండుకుంది. మూలన పడేసిన తుండుగుడ్డ సంగతి జ్ఞాపకమువచ్చి చూసేసరికి సగం తుండుగుడ్డ కాలిపోయింది. అది భార్య ఎక్కడ చూస్తుందోనని ఆమెను కసిరి ఏదో పనిమీద అవతలికి పంపి, గుడ్డ పేలికను చింపి తడిపి వేలుకు కట్టుకున్నాడు. ఇంకా దుంపలు తరిగితే వేలు కోసుకుంటుందేమోనని ఒక ప్రక్క భయం – అందుచేత దుంపల నలాగే ఉడకవేసి చల్లారిన తరువాత వాటిని నలిపి తిరుగమోత వేయడానికి బాణలి పొయిమీద పెట్టి "పెద్దమ్మాయ్! యిలా రా – కోపపడితే ఎలాగమ్మా! యిదిగో యీ రెండణాలు తీసికొనిపోయి బొమ్మలు కొనుక్కో... మీయమ్మను దుంపల తిరగబోతకు యేమి వేయాలో అడుగు" అంటూ నేతిగిన్నెను బాణట్లో క్రుమ్మరించాడు.

"ఆవాలు, జీలకర, మినపప్పు, మిరపకాయలు చాలు నాన్నా!" అన్నది అమ్మాయి.

"ఎంతెంత వేయాలో అడుగమ్మా."

"నాకు తెలుసులే నాన్నా!" అంటూ తిరుగమోత గింజల డబ్బా తెచ్చేసరికి యింతలో తనతో చదువుకునే అమ్మాయి వచ్చి బయట "లీలా!" అని పిలువగానే పెట్టె అక్కడపెట్టి వెళ్ళిపోయింది.

ఆ పెట్టెలో నాలుగు పెద్ద డబ్బాలు, 12 చిన్న డబ్బాలు ఉన్నవి. ఒకదాంట్లో మెంతులు, మరొకదాంట్లో జీలకర, యింకొకదాంట్లో మిరియాలు ఉన్నవి. వాటిని చూచేసరికి అయోమయంగా తోచింది.

"ఇటువంటి చదువురాని ముండ వుంటే వంటయిల్లు యింతే! ఆవాలు ఏవో, మెంతులు ఏవో ఆ డబ్బాలమీద చీట్లు వ్రాసి అంటించకూడదూ! ఆ వెధవ ఆవాలను ఎక్కడ తగులబెట్టావు యింతకూ!" అన్నాడు చిందులు త్రొక్కుతూ.

"కడపటి వరుసలో ఎడమచేతి తట్టు రెండవ డబ్బాలో ఉంటవి చూడండి అన్నది అత్తయ్య.

చారెడు ఆవాలు, మినపప్పనుకొని చారెడు పెసరపప్పు, తుంచకుండానే ఆరు, ఏడు మిరపకాయలు వేశాడు. వంట బాగాయింది. నెయ్యి మాడు వాసన కొడుతున్నది. ఆవాలు చిటపటమంటూ ఎగిరి కండ్లలో పడుతున్నవి. బాణలికి ఒకతట్టు చెమలేదు. "ఏమి చేయాలి దేవుడా!" అని కంగారుపడుతుంటే అమ్మాయి వచ్చి, "నాన్నా! యీ రోజున బడికి దొరసానమ్మ వస్తుందట! నాకు త్వరగా అన్నం పెట్టు వెళ్లాలి" అన్నది కంచం చేతపట్టుకొని.

"పంతులుగారు యీరోజు యింకా ఆఫీసుకు బయలుదేరలేదే!" అంటూ వాళ్ళ ఆఫీసు గుమాస్తా వెంకటకృష్ణయ్య నడవలోకి వచ్చాడు. సందువాకిట్లో నుండి వంటయింట్లో జొరబడి కోతి ఒక డబ్బా ఎత్తుకవెళ్ళింది. అప్పుడే మిషన్ స్కూలు గడియారం 11 గంటలు కొట్టింది.

"భవతీ భిక్షాందేహి" అంటూ ఒక కుర్రవాడు గుమ్మంగడ పెక్కాడు.

వంటయింటి నిండా చిందరవందరగా సామానులు. పెద్దమ్మాయి నిస్పృహతో మంచముమీద వాలింది. సుబ్బి వాకిట్లోకి వచ్చి, "నేను నూతి దగ్గర గుడ్డలుతుకుతుంటిని కదా కోతిని నేనక్కడమ్మా చూచేని! అది నాతో చెప్పి వచ్చిందా – ఆరు నెలలయింది తల్లీ! నాకియ్యాల్సిన డబ్బు పారేస్తే నేను వెళ్ళిపోతాను – పనికి వేరే మనిషిని చూచుకోండి!" అన్నది తనకు పనిచేయడం భారంగానున్నట్లు.

ఇక కూర ఏ పాకాన దిగినది, ఉప్పు వేసిందీ లేనిదీ, అన్నం తినడానికి పనికొచ్చిందీ లేనిదీ మీరే యూహించుకోవచ్చు. చివరకు పాపం యీ గడబడను చూచి ప్రక్కయింటి సీతమ్మ పిల్లలను పిలుచుకొనివెళ్ళి తనయింట్లో అన్నం పెట్టింది. పాపం ఆమె అత్తయ్యకు, మామయ్యకు కూడా మళ్ళా అన్నం వండి కూర, పులుసుతో సహా క్యారియరులో పెట్టి పంపిస్తే – మామయ్య భోంచేసి ఆఫీసుకి వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. తను ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళినందుకు పై అధికారికి మామయ్య ఏం సంజాయిషీ చెప్పుకున్నాడో పాపం!

ఇటువంటి సంఘటనలు, సన్నివేశాలు ఎప్పుడో కప్పుడు మీ యిండ్లలో జరిగియుండవంటారా!!